సాక్షి అనంతపురం

గురువారం । 1 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



అమ్మకు ప్రేమతో ఐఏఎస్

కుటుంబం కోసం అమ్మపడ్డ కష్టం చూసి కసితో చదివి ఐఏఎస్ సాధించారు అసిస్టెంట్ కలెక్టర్ నూరపాటి ప్రశాంత్‌కుమార్. 8లో

గరిష్టం/కనిష్టం 43.1°/24.4°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. మధ్యాహ్నం వరకు వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

'సెబ్' అదనపు ఎస్పీగా రామకృష్ణ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అదనపు ఎస్పీగా జి.రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ జిల్లా పెద్దపూడి గ్రామానికి చెందిన జి.రామకృష్ణ 1989లో ఎస్‌ఐగా పోలీసుశాఖలో చేరారు. 2003లో సీఐగా, 2013లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. విజయవాడ, ప్రకాశం జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. ఒంగోలు డీటీసీ డీఎస్పీగా పని చేస్తున్న ఈయనను పదోన్నతిపై సెబ్ అదనపు ఎస్పీగా అనంతపురానికి బదిలీ చేశారు.

నేటి నుంచి రాగుల పంపిణీ



కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎండీయూ నిర్వాహకులు (ఫైల్)

అనంతపురం అర్బన్: జిల్లాలో బియ్యం కార్డుదారులకు ఉచితంగా బియ్యంతో పాటు అత్యధిక పోషక విలువలున్న రాగులను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. జిల్లా వ్యాప్తంగా 6,54,180 మంది కార్డుదారులకు 650 టన్నుల రాగులను ప్రభుత్వం కేటాయించింది. జూన్ నెల కోటా కింద గురువారం నుంచి ఎండీయూ (మొబైల్ డిస్పెర్సింగ్ యూనిట్) వాహనాల ద్వారా కార్డుదారులకు పంపణీ చేయనున్నారు. నగరంలోని బుడ్డప్పనగర్‌లోని రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు రాగుల పంపిణీని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. తొలుత పట్టణ ప్రాంతాల్లోని కార్డుదారులకు రాగులను పంపిణీ చేస్తారు. తదుపరి గ్రామీణ ప్రాంతాల్లోని కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు. కార్డుదారుల కోరిన మేరకు ఒక కిలో నుంచి ముడు కిలోల వరకు బియ్యం స్థానంలో రాగులను ఉచితంగా అందజేస్తారు.

అర్ధరాత్రి దాకా అభ్యంతరాల పరిశీలన

రాప్తాడురూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ టీచర్ల బదిలీల ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన ప్రక్రియ బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట దాకా సాగింది. ఇందుకోసం అనంతపురం సైన్స్ సెంటర్‌లో ఆరు బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో నలుగురు దాకా సభ్యులున్నారు. డీఈఓ ఎం.సాయిరాం ప్రత్యేక పర్యవేక్షణలో అభ్యంతరాలను పరిశీలిస్తున్నారు. ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాపై మంగళవారం సాయంత్రానికి 633 వచ్చినా.. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉండడంతో అర్ధరాత్రి సమయానికి 731 అభ్యంతరాలు వచ్చాయి. వీటిలో అత్యధికంగా 300 దాకా స్టేషన్ సీనియార్టీ పాయింట్లపైనే ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అలాగే రేషనలైజేషన్, స్పౌజ్‌కేటగిరి, సర్వీస్‌పాయింట్లు, ప్రిఫరెన్షియల్ కేటగిరి, పీహెచ్ కేటగిరిపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తున్నారు. గురువారం సాయంత్రానికి ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని డీఈఓ తెలిపారు.

ముగిసిన ఆర్‌టీఐ క్యాంపు కోర్టు



ఆర్‌టీఐ కమిషనర్‌కు వివరణ ఇస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి

అనంతపురం అర్బన్: సమాచార హక్కు కమిషనర్ యు.హరిప్రసాదరెడ్డి అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్యాంపు కోర్టు బుధవారం ముగిసింది. మొత్తం 28 కేసులను విచారణ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలను కమిషనర్ వెల్లడించారు. కోరిన సమాచారం ఇవ్వని కారణంగా విద్యుత్ శాఖకు చెందిన రెండు కేసుల్లో దరఖాస్తుదారులకు రూ.5 వేల చొప్పున పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించామన్నారు. మరో ఎనిమిది కేసులకు సంబంధించి దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని గడువులోపు ఇవ్వని కారణంగా హౌసింగ్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల నుంచి లిఖితపూర్వక వివరణ తీసుకున్నామన్నారు. ఆర్‌టీఐకు సంబంధించి రికార్డుల నిర్వహణపై ఇక్కడి అధికారులకు అవగాహన లేదనే విషయం ఈ క్రమంలో తెలిసిందన్నారు. అనంతపురంలో క్యాంపు కోర్టు నిర్వహించడం ద్వారా తమకు వ్యయభారం తగ్గించారంటూ రెస్పాండెంట్‌లు హర్షం వ్యక్తం చేశారన్నారు.

ముంగారు షురూ..

సాగుకు సమాయత్త మవుతున్న రైతులు

- నేటి నుంచి కీలకమైన 'ఖరీఫ్' ప్రారంభం
- ఈ సీజన్‌లో సాగు అంచనా 4,40,877 హెక్టార్లు
- రెండో వారంలో జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు
- 319.6 మి.మీ వర్షాలపై ఆధారపడిన వ్యవసాయం
- రైతుకు అందుబాటులో రాయితీ విత్తనం, ఎరువులు
- ఈ నెల 15 నుంచి జూలై ఆఖరు వరకు విత్తుకు అదను



అనంతపురం అగ్రికల్చర్: 'అనంత' రైతుల ఆశల సేద్యం 'ముంగారు' గురువారం నుంచి మొదలు కానుంది. వరుణుడి కరుణకు ప్రభుత్వ సాయం తోడవడంతో రైతన్న కొంగొత్త ఆశలతో వ్యవసాయానికి సిద్ధమయ్యాడు. ఖరీఫ్-2023 సాధారణ సాగు విస్తీర్ణం 4,40,877 హెక్టార్లు (11,02,192 ఎకరాలు)గా గుర్తించారు. అందులో నీటి వసతి కింద 1,01,158 హెక్టార్లు (2,52,895 ఎకరాలు) కాగా.. వర్షాధారంగా 3,39,719 హెక్టార్లు (8,49,297 ఎకరాలు)గా అంచనా వేశారు. ప్రధాన పంట వేరుశనగ 2,31,150 హెక్టార్లుగా లెక్క వేశారు. వేరుశనగ తర్వాత ప్రధాన పంటలుగా పత్తి 51,162 హెక్టార్లు, కంది 30,225 హెక్టార్లు, ఆముదం 12,463 హెక్టార్లు, మొక్కజొన్న 8,431 హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేశారు. ఆ తర్వాత జొన్న 7,041 హెక్టార్లు, ఉలవ 4,529 హెక్టార్లు, ఇక నీటి వసతి కింద ప్రధానపంటగా వరి 17,440 హెక్టార్లు కాగా మిగతావి పండ్లతోటలు, కూరగాయల పంటలు, అలాగే మిరప, ఉల్లి, చెరకు తదితర పంటలు సాగులోకి రానున్నట్లు పేర్కొన్నారు. కాగా గతేడాది 2022 ఖరీఫ్‌లో 4.04 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చాయి.

4.03 లక్షల మంది రైతులు

జిల్లాలో 4,03,454 మంది రైతులు ఉన్నారు. అందులో ఒక హెక్టారులోన్న సన్నకారు రైతులు 1,27,584 మంది ఉండగా, ఒకటి నుంచి రెండు హెక్టార్లలోపున్న చిన్నకారు రైతులు 1,47,044 మంది ఉన్నారు. ఇక రెండు నుంచి నాలుగు హెక్టార్ల లోపున్న మధ్యస్థ రైతులు 1,03,793 మంది ఉండగా, 4 నుంచి 10 హెక్టార్ల వరకు ఉన్న ఓ మాదిరి రైతులు 22,952 మంది, 10 హెక్టార్ల కన్నా ఎక్కువ కలిగిన పెద్ద రైతులు కేవలం 2,081 మంది ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నారు.

'నైరుతి'పై ఆశలు

ఖరీఫ్ మొదలు కాకమునుపే మే మొదటి వారం జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడ్డాయి. ఇటీవల అక్కడక్కడా వర్షపాతం నమోదు కావడంతో రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పటికే 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, 30 శాతం రాయితీతో కందులు, ఉలవలు, 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌లతో పాటు ప్రైవేట్ రిటైల్ డీలర్ల వద్ద తగినంత ఎరువులు కూడా అందుబాటులో పెట్టారు. రైతు భరోసా, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాల రెన్యూవల్స్ ద్వారా పెట్టుబడికి ఇబ్బంది లేకుండా రైతులను సిద్ధం చేశారు. ఇక తొలకర్లు మొదలు కానుండగా వర్షాలకు అత్యంత కీలకమైన నైరుతి రుతుపవనాలు (సౌత్‌వెస్ట్‌మాన్‌సూన్స్) ఈనెల రెండో వారం జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా అందులో కీలకమైన ఖరీఫ్ (జూన్ నుంచి సెప్టెంబర్) నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9 మి.మీ, ఆగస్టులో 83.8 మి.మీ, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు. వేరుశనగతో పాటు ప్రధాన పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై ఆఖరు వరకు సరైన సమయమని ఏఆర్‌ఎస్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ సాదినేని మల్లీశ్వరి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు.

2023 ఖరీఫ్‌లో ప్రధాన పంటల విస్తీర్ణం అంచనా

పంట	హెక్టార్లలో
వేరుశనగ	2,31,150
వరి	17,440
కంది	30,225
పత్తి	51,612
ఆముదం	12,463
మొక్కజొన్న	8,431
జొన్న	7,041
సజ్జ	1,355
కొర్ర	1,654
ఉలవ	4,529
పెసర	1,598
పొద్దుతిరుగుడు	1,978

ఉమ్మడి పరిశోధనలు సాగాలి

- క్లస్టర్ యూనివర్సిటీ వీసీల సమావేశంలో నిర్ణయం



క్లస్టర్ యూనివర్సిటీ సమావేశంలో పాల్గొన్న ఎస్కేయూ, జేఎన్‌టీయూ వీసీలు

అనంతపురం: యూనివర్సిటీలు ఉమ్మడి పరిశోధనలు చేపట్టాలని వీసీల సమావేశంలో నిర్ణయించారు. జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనంలో బుధవారం క్లస్టర్ యూనివర్సిటీ (ఎస్కేయూ, జేఎన్‌టీయూ (ఏ), సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ, శ్రీ సత్యసాయి డీమ్డ్ వర్సిటీ, రాయలసీమ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, కర్నూలు) వీసీల ప్రణాళికా సంఘం సమావేశమైంది. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూలై ఒకటి, రెండు తేదీల్లో తేదీల్లో ఉన్నత విద్య ప్రణాళికా సంఘం సమావేశం జేఎన్‌టీయూ కాకినాడలో జరగనుంది. ఇందులో క్లస్టర్ యూనివర్సిటీకి సంబంధించిన ప్రగతి నివేదికను వివరించనున్నారు. త్వరలోనే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆవిష్కరణ సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వర్చువల్‌గా రాయలసీమ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఆనందరావు, రిజిస్ట్రార్ సుందరానంద్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, ఉర్దూ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఫజుల్ రెహమాన్, శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సాయి గిరిధర్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అందరూ సుభిక్షం





పార్టీ నాయకులను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సభకు హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

- ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి
- అభివృద్ధి, సంక్షేమం చేతల్లో చూపిన సీఎం
- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చేశారని పేర్కొన్నారు. ఉరవకొండలోని వీరశైవనగర్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి విశ్వ ప్రారంభించారు. ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సభలో పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నంటి ఉండి పనిచేసిన ఉరవకొండ, బెళుగుప్ప, కూడేరు, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లోని వందమంది సీనియర్ నాయకులను ఘనంగా సత్కరించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ తన నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి - సంక్షేమాన్ని జగన్ చేతలో చూపించారని కొనియాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన సీఎంగా చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేశారని, 30 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నారని, రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారన్నారు. మరో రూ.లక్ష కోట్లు వివిధ పథకాల ద్వారా అందించారని వివరించారు. ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం గడిచిన నాలుగేళ్లలో రూ.3వేల కోట్లు వెచ్చించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. పేదలకు ఇస్తున్న సెంటు, సెంటున్నర స్థలం సమాధులు కట్టడానికి కూడా సరిపోవని పేదలను అవహేళన చేశారని దుయ్యబట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ పేదలను మోసం చేయడానికే చంద్రబాబు ఉత్తుత్తి హామీలతో మేనిఫెస్టో ప్రకటించారన్నారు. 2014 ఎన్నికల్లో దాదాపు 600 హామీలు ప్రకటించి ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేని అసమర్థుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, ఎంపీపీలు చందా చంద్రమ్మ, కరణం పుష్పావతి, నారాయణరెడ్డి, పెద్దన్న, ఉరవకొండ సర్పంచ్ లలితమ్మ, వైస్ ఎంపీపీలు వై.శ్రీనాథ్‌రెడ్డి, నరసింహులు, బెస్త, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు రమణ, గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.

జవాబుదారీతనం పెంచేందుకే జగనన్నకు చెబుదాం



మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి అరుణ్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్

- జిల్లా ప్రత్యేక అధికారి అరుణ్‌కుమార్

అనంతపురం అర్బన్: సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపించి.. ప్రజల్లో సంతృప్తస్థాయిని పెంచే బాధ్యత అధికారులపై ఉందని, ఈ విషయంలో జవాబుదారీతనం పెంచేందుకే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా ప్రత్యేక అధికారి, పౌరసరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అందే అర్జీల పరిష్కారం తీరుపై ప్రత్యేక అధికారి బుధవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతతో అర్జీల పరిష్కారానికి కృషిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి సంబంధించి 1902 టోల్ ఫ్రీ నంబర్‌ను జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజలకూ తెలిసేలా ప్రచారం నిర్వహించాలన్నారు. అర్జీలు పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరిస్తే ప్రజల్లో సంతృప్తిస్థాయి పెరుగుతుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, ట్రైనీ కలెక్టర్ కుశల్‌జైన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి


అనంతపురం రూరల్: ప్రజలకు మెరుగైన సేవలందించేలా సచివాలయ, ఆర్బీకే ఉద్యోగులు పని చేయాలని పౌరసరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టర్ గౌతమితో కలసి అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం, రాజీవ్‌కాలనీ పంచాయతీల పరిధిలోని సచివాలయాలు, ఆర్బీకేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు రైతు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతలకు జగన్ సర్కారు 'భరోసా'

- నేడు తొలివిడతగా రూ.7,500 ప్రకారం రైతులకు రూ.217 కోట్లు విడుదల
- అక్టోబర్‌లో రబీకి రెండో విడత, సంక్రాంతికి మూడో విడతగా జమ
- గతేడాది రూ.13,500 చొప్పున రూ.373.05 కోట్ల సొమ్ము పంపిణీ
- ఈసారి 2,87,697 మంది రైతులకు రూ.383 కోట్ల పెట్టుబడిసాయం
- 4,939 మంది రైతులకు రూ.8.31 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ కూడా జమ

నియోజక వర్గాల వారీగా తొలివిడతగా రూ.7,500 ప్రకారం భరోసా ఇలా..

నియోజక వర్గం	రైతు కుటుంబాలు	లబ్ధి (రూ.కోట్లలో)
రాయదుర్గం	44,655	33.49
గుంతకల్లు	29,382	22.04
కళ్యాణదుర్గం	53,896	40.42
రాప్తాడు	24,141	18.11
శింగనమల	53,635	40.42
తాడిపత్రి	31,923	23.94
ఉరవకొండ	50,065	37.55
కౌలు రైతులు	1,419	01.06



అనంతపురం అగ్రికల్చర్: రైతు సంక్షేమానికి జగన్ సర్కారు కట్టుబడి పనిచేస్తోంది. నవరత్నాలలో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడిసాయం అందిస్తోంది. ఫలితంగా ఖరీఫ్, రబీ, పంట నూర్పిడి సమయంలో రైతుకు ఉపశమనం లభిస్తోంది. వరుసగా నాలుగు సంవత్సరాలు దిగ్విజయంగా జిల్లా రైతులకు రూ.1,557 కోట్ల మేర భరోసా సొమ్ము జమ చేసిన సర్కారు... ఇప్పుడు ఐదోసారి (2023-24కు సంబంధించి) ఇవ్వడానికి రెడీ అయ్యింది. తొలివిడతగా గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఒక్కో రైతుకు రూ.7,500 ప్రకారం జమ చేయనున్నారు. జిల్లాలో ఖరీఫ్ పంటలు సాగు చేసే 2,89,116 మంది రైతులకు తొలివిడతగా రూ.217 కోట్ల వరకు ఊరట కలగనుంది. రెండో విడతగా అక్టోబర్‌లో రబీ సాగుకు రూ.4 వేల చొప్పున, చివరి విడతగా జనవరిలో పంట నూర్పిడి సమయంలో సంక్రాంతి కానుకగా రూ.2 వేలు జమ చేయనున్నారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.7,500, కేంద్రం వాటా కింద రూ.6 వేలు ఇవ్వనున్నారు. కౌలు రైతులు, అటవీభూములు, దేవదాయ భూముల సాగుదారులకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి మొత్తం రూ.13,500 భరిస్తోంది.


పెరిగిన పెట్టుబడి సాయం

నాలుగో ఏడాది 2022-23లో వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద మూడు విడతల్లో 2,76,336 మంది రైతులకు రూ.373.05 కోట్ల పెట్టుబడి సాయం అందించారు. అందులో ఖరీఫ్‌కు రూ.207 కోట్లు, రబీకి రూ.110 కోట్లు, గత ఫిబ్రవరిలో మూడో విడత కింద రూ.56 కోట్ల మేర 'భరోసా' కల్పించారు. ఈసారి 2023-24కు సంబంధించి కొత్తగా 13 వేల మంది రైతులు భరోసాకు దరఖాస్తు చేసుకోవడంతో వారికి కూడా సొమ్ము ఇవ్వనున్నారు. ఈ ఏడాది మూడు విడతలకు కలిపి 2,87,697 మంది రైతులకు రూ.383 కోట్లు మంజూరైంది.

రూ.8.31 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

ఇటీవల కాలంలో ఈదురుగాలులు, వడగండ్లవాన, అకాల వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడిరాయితీ)ని విడుదల చేసింది. జిల్లాలో పంటలు నష్టపోయిన 4,939 మంది రైతులకు రూ.8.31 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ జమ కానుంది.

రైతు కష్టాలు తెలిసిన సీఎం జగన్



పాదయాత్ర సందర్భంగా రైతు పడుతున్న కష్టాలు కడగండ్లు కళ్లారా చూసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే రైతులను ఆదుకుంటున్నాడు. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద ఏటా రూ.13,500 పెట్టుబడిసాయం అందిస్తున్నాడు. నాకు 3.69 ఎకరాలు ఉండగా... ఏటా పెట్టుబడికి ఇబ్బంది లేకుండా భరోసా వస్తోంది. ఇది కాకుండా ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, సున్నావడ్డీ, ఆర్‌బీకే వేదికగా విత్తనాలు, ఎరువులు, యంత్రపరికరాలు...ఇలా చెబుతూ పోతే రైతులకు పెద్ద ఎత్తున సాయం చేస్తున్నారు.

– కె.రామాంజి, ముదిగల్లు, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


మృతురాలు రుక్మిణి

గుంతకల్లు టౌన్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని పీఅండ్‌టీ కాలనీలో నివాసముంటున్న రైల్వే ఎలక్ట్రికల్ విభాగం జేఈ ఎం.రవికి మూడేళ్ల క్రితం తెలంగాణలోని ఖమ్మం పట్టణానికి చెందిన రుక్మిణి (25)తో వివాహమైంది. వీరికి ఓ బాబు ఉన్నాడు. బుధవారం ఉదయం రవి విధులకు వెళ్లగానే రుక్మిణి ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కాపాడి రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రుక్మిణి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయనున్నట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

5న జిల్లాస్థాయి చెస్ పోటీలు


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి సావిత్రి

అనంతపురం అర్బన్: విప్లవకారుడు చెగువేరా 95వ జయంతిని పురస్కరించుకుని ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి సావిత్రి తెలిపారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవనలో ఆయా సంఘాల నాయకులతో కలసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెస్ ఆటగాళ్లు ఎవరైనా ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గెలుపొందిన వారికి ప్రశంసాపత్రంతో పాటు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలిచిన వారు ఈ నెల 4వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 97003 86070, 91822 16213లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహ, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో ఉద్యోగుల బదిలీలు

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీలో పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ ఎస్‌ఈ ఎన్.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు సూపరింటెండెంట్లు, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు ఆఫీస్ సబార్డినేట్‌లకు స్థానచలనం కల్పించారు.

అమ్మకు ప్రేమతో ఐఏఎస్

తనను చదివించేందుకు తల్లి పడుతున్న కష్టాన్ని ఆ యువకుడు మరువలేదు. ఉన్నత స్థానానికి చేరి మాతృమూర్తి కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడి చదివాడు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పరీక్షలో సత్తా చాటి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పట్టుదల ఉండాలే గానీ సాధించలేనిదంటూ ఏదీ లేదని చెబుతున్న ఆ యువకుడు మరెవరో కాదు.. అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్. వృత్తి శిక్షణలో భాగంగా ఆత్మకూరు వచ్చిన ఆయన తన అంతరంగాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

– ఆత్మకూరు



పేరు : ప్రశాంత్‌కుమార్
పుట్టిన రోజు : 18-11-1994
చదువు : ఇంజినీరింగ్ (వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, హైదరాబాద్)
ఐఏఎస్‌కు ఎంపికైన సంవత్సరం : 2021
ర్యాంకు : 498
అభిరుచులు : మార్షల్ ఆర్ట్స్, తైక్వాండో, తీరిక సమయంలో సినిమాలు చూడడం

- స్ఫూర్తి దాయకం.. ఐఏఎస్ ప్రశాంత్‌కుమార్ నేపథ్యం

మాది పార్వతీపురం. నాన్న బాబురావు ఆర్మీలో పని చేసి రిటైర్డయ్యారు. అమ్మ స్వర్ణలత ఏఎన్‌ఎం. అన్నయ్య ప్రదీప్. ప్రస్తుతం మల్టీ నేషనల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. నేను ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు పార్వతీపురంలో, 8 నుంచి 10 వరకూ మహారాష్ట్రలోని నాసిక్‌లో చదివా. వైజాగ్‌లో డిప్లొమా చేశా. హైదరాబాదులోని వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 2017లో ఇంజినీరింగ్ పూర్తి చేశా.

అమ్మ కష్టమే చదివించింది..

నేను ఆరో తరగతి చదివేటప్పుడు రోడ్డు ప్రమాదంలో నాన్న బాబురావు మరణించారు. మా కోసం అమ్మ ఆ దుఃఖాన్ని దిగమింగి నన్ను, అన్నయ్యను కష్టపడి చదివించింది. తనకు వచ్చే జీతంతోనే మాకు ఏ లోటూ తెలియకుండా పెంచింది. అందుకే అమ్మ కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా కష్టపడి చదివా. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా. అనుకున్నది సాధించి ఐఎస్‌ఏగా ఎంపికై అమ్మకు కానుక అందించా.

మార్కుల కోసం చదవొద్దు..

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. మనపై ఉన్న నమ్మకమే మనల్ని ఉన్నత స్థాయికి చేరుస్తుంది. అనుకున్నది సాధించడానికి మూడు సంవత్సరాలు తీవ్రంగా కష్టపడ్డా. నేను మార్కుల కోసం ఎప్పుడూ చదవలేదు, చదివింది అర్థం అయేటప్పుడు ఆ సంతోషం వేరుగా ఉంటుంది. చాలా మంది డబ్బు ఉంటేనే సివిల్స్‌కు చదవగలం, రాయగలం అనుకుంటారు. కానీ నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వాడినే. కష్టపడి చదివా. మనం అనుకున్నది సాధించడానికి స్పష్టమైన లక్ష్యం ఉంటే చాలు.

ఆయన ప్రేరణతోనే సివిల్స్‌కు..

పార్వతీపురం మన్యం జిల్లాలోని మన్యం ఐటీడీఏ పీఓగా కొంతకాలం క్రితం ఐఏఎస్ లక్ష్మీష పనిచేశారు. పార్వతీపురం సమీపంలోని ఓ కొండపై కొన్ని గ్రామాలు ఉండేవి. సరైన వైద్య సదుపాయాలు లేక అక్కడి ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. మహిళలు గర్భం ధరిస్తే ప్రసవం కోసం కొండ మీద నుంచి అవస్థలు పడుతూ కిందకు తీసుకురావాల్సి వచ్చేది. అలా తీసుకొచ్చాక చాలా సార్లు ఆ మహిళనో లేదా పుట్టిన బిడ్డో చనిపోయేవారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు ఐఏఎస్ లక్ష్మీష హాస్టళ్లను ఏర్పాటు చేశారు. ప్రసవానికి మూడు నెలలు ఉండగానే సదరు మహిళను తీసుకువచ్చి అక్కడ ఉంచి.. వారితో యోగా సాధన చేయించడంతో పాటు మంచి ఆహారం అందించేవారు. దీంతో ప్రసవం తర్వాత తల్లీ బిడ్డ క్షేమంగా ఉండేవారు. ఎందుకో తెలియదు ఒకసారి లక్ష్మీష గురించి మా అమ్మ నాకు చెప్పింది. ఒక ఐఏఎస్ తలచుకుంటే సమాజంలో ఎంతో మార్పు తీసుకురావొచ్చని వివరించింది. దీంతో నేనూ ఐఏఎస్ కావాలనిపించింది. నేను ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో శ్రీకాకుళంకు చెందిన గోపాల కృష్ణ అనే వ్యక్తి దేశస్థాయిలో సివిల్స్‌లో 3వ ర్యాంక్ సాధించారు. కష్టపడితే ఎవరైనా ఏదైనా సాధించవచ్చన్న విషయం ఆయన విజయంతో నాకు బోధపడింది.

నెగెటివ్‌గా మాట్లాడేవారిని పట్టించుకోవద్దు..

చాలా మంది విద్యార్థులు పదో తరగతిలో తప్పామనో, ఇంటర్ ఫెయిల్ అయ్యామనో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అలా చేయడం చాలా తప్పు. ప్రతి విషయాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలి. నెగెటివ్‌గా మాట్లాడే వారిని పట్టించుకోవద్దు. మన మీద మనకు నమ్మకం ఉండాలి. ఆ నమ్మకమే ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది. నేను మూడో ప్రయత్నంలో సివిల్స్‌కు ఎంపికయ్యా. మొదటి రెండు సార్లు చేసిన తప్పుల్ని సరిదిద్దుకుని సులువుగా గట్టెక్కా.

జిల్లావాసులు చాలా మంచివారు..

అనంతపురంలో కొన్ని నెలలుగా పనిచేస్తున్నా. జిల్లా ప్రజలు చాలా మంచి వారు. ఎలాంటి కల్మషం లేని మనుషులు. ఆత్మీయంగా పలకరిస్తారు. ఈ ప్రాంతంలో ముఖ్యంగా నాకు నచ్చిన విషయం ఏంటంటే ఎటుచూసినా పండ్ల తోటలు ఉండటం.

పొగాకు వినియోగం ప్రాణాంతకం

- మేయర్ వసీం, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్


ర్యాలీను ప్రారంభిస్తున్న మేయర్ వసీం, అసిస్టెంట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్‌కుమార్

అనంతపురం క్రైం: పొగాకు వాడకం వల్ల దేశవ్యాప్తంగా ఏటా లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, పొగాకు వినియోగానికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు అనంతపురం నగర మేయర్ వసీం పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని జిల్లా ఆరోగ్యశాఖాధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కుషాల్ జైన్‌తో కలసి బుధవారం ఆయన ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల సమీపంలోని దుకాణాల్లో పొగాకు విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పొగాకు వాడకంతో ఎదురయ్యే దుష్ప్రభావాలపై ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరచాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆహారపు అలవాట్లను మార్చుకోవడంతో పాటు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే రూ.200 జరిమానా విధించేలా చట్టం ఉందన్నారు. అనంతరం పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కర రెడ్డి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోసానికి నిలువెత్తు రూపం బాబు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య


మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: మోసానికి నిలువెత్తు రూపం నారా చంద్రబాబు నాయుడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. టీడీపీ మహానాడు ఒక మాయానాడుగా అభివర్ణించారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రకటించిన టీడీపీ మేనిఫెస్టోను ప్రజలు చిత్తుకాగితంగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. తాడిపత్రి రూరల్ పరిధిలోని జీవీపీ కాలనీలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. 2014 ఎన్నికలకు ముందు 600 హామీలను ఇచ్చి, 100 పేజీల మేనిఫెస్టోను చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. బాబు వస్తే జాబు గ్యారంటీ అన్నారన్నారు. బ్యాంకుల్లోని బంగారం ఇంటికి వస్తుందన్నారు. నిరుద్యోగ భృతి అన్నారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తామన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఏ ఒక్క హామీని నెరవేర్చక పోగా చివరకు ఎన్నికల మేనిఫెస్టోను ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి మాయం చేసి ప్రజలను వంచనకు గురి చేశారన్నారు. ఇప్పుడేమో తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతి పేదవాడినీ సంపన్నుడిని చేస్తామని మహానాడులో హామీలు గుప్పించడం మరోసారి ప్రజలను మోసం చేయడానికేనన్నారు. ఎన్టీఆర్ బతికి ఉన్నప్పుడు ఆయనపై చెప్పులు వేయించిన నీచుడు చంద్రబాబన్నారు. వెన్నుపోటుతో సీఎం పదవిని లాక్కొని ఆ మహానుభావుడి మృతికి కారణమయ్యారన్నారు. ఎన్టీఆర్ కుటుంబీకులను సైతం పార్టీకి దూరంగా ఉంచిన చంద్రబాబు ఎంతో ప్రమాదకారో గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 175 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేని దశలో టీడీపీ ఉందన్నారు. ఇతర పార్టీలతో పొత్తులకు పాకులాడే చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదన్నారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా సీఎం వైఎస్ జగన్ ఒంటరిగానే పోటీ చేస్తారని, 2024 ఎన్నికల్లో 175 స్థానాలకు గాను 175 స్థానాలూ వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గురుప్రసాదరెడ్డి, భాస్కరరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

భర్త రెండో పెళ్లి - పోలీసులకు మొదటి భార్య ఫిర్యాదు

పెద్దపప్పూరు: తనకు తెలియకుండా రెండో పెళ్లి చేసుకున్న భర్తపై పోలీసులకు మొదటి భార్య ఫిర్యాదు చేసింది. వివరాలు.. పెద్దపప్పూరులోని ఆర్డీటీ కాలనీలో నివాసముంటున్న గంగాధర్‌కు కొన్నేళ్ల క్రితం చాగల్లుకు చెందిన పుల్లమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దపప్పూరులోనే పెట్రోల్ బంక్ ప్రాంతంలో నివాసముంటున్న ఒంటరి మహిళను గంగాధర్ బుధవారం రెండో పెళ్లి చేసుకున్నాడు. భర్త మృతిచెందడంతో తన పదేళ్ల వయసున్న కుమారుడితో కలసి ఆమె జీవిస్తోంది. గంగాధర్‌తో కొంత కాలంగా సహజీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెను గంగాధర్ రెండో వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పుల్లమ్మ తనకు అన్యాయం జరిగిందంటూ పెద్దపప్పూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్‌ఐ ఖాజాహుస్సేన్‌ను వివరణ కోరగా.. తనకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

వ్యక్తి దుర్మరణం


మృతుడు రామాంజినేయులు

పెద్దవడుగూరు: కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లికి చెందిన రామాంజినేయులు (39) కుటుంబసభ్యులతో కలసి క్రిష్టిపాడులో బంధువుల ఇంట జరుగుతున్న శుభకార్యానికి హాజరయ్యాడు. బుధవారం ఉదయం పెళ్లి వేడుక చూసుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. ముప్పాలగుత్తి వద్దకు చేరుకోగానే లిఫ్ట్ అడిగిన గంగాధర్ అనే వ్యక్తిని వాహనంపై ఎక్కించుకుని బయలుదేరాడు. లక్షుంపల్లి వద్దకు చేరుకోగానే కదదరగుట్టపల్లికి చెందిన సోమశేఖరనాయుడు కారులో వేగంగా దూసుకెళుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన రామాంజినేయులును 108 అంబులెన్స్‌లో పామిడిలోని సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. స్వల్ప గాయాలతో బయటపడిన గంగాధర్ పెద్దవడుగూరు పీహెచ్‌సీలో చికిత్స పొందాడు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

టీడీపీ నాయకుల దాడి

కణేకల్లు: స్థల వివాదం కారణంగా కణేకల్లు మండలం తుంబిగనూరులో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు దాడికి తెగబడ్డారు. గ్రామస్తులు తెలిపిన మేరకు.. 13 ఏళ్లుగా 4 సెంట్ల ప్రభుత్వ భూమి వైఎస్సార్‌సీపీకి చెందిన టెంకాయల గోవిందప్ప అనుభవంలో ఉంది. ఈ భూమి పక్కనే ఉంటున్న టీడీపీ నాయకుడు సొండి సురేష్ ఈ స్థలం తనకే దక్కుతుందని బుధవారం గోవిందప్పతో గొడవకు దిగాడు. మాటలతో రెచ్చగొట్టి గోవిందప్ప, అక్కమ్మతో పాటు వారి వర్గీయులపై సురేష్, ఆయన సోదరుడు ముక్కన్న, మరికొందరు భౌతిక దాడికి దిగారు. ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 14 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు అస్వస్థత

బుక్కరాయసముద్రం: మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఫుడ్‌పాయిజన్ కారణంగా పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి మెస్‌లో ఎగ్ రైస్, టమాట రైస్, పెరుగన్నం తిన్న 86 మంది స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. వీరిలో 26 మందికి బుధవారం ఉదయం వైద్య సిబ్బంది చికిత్స నిర్వహించారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర, డీఈఓ సాయిరాం, కొర్రపాడు డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. మసాలా ఆహారానికి తోడు వేసవి ఉక్కపోత తోడై అస్వస్థతకు గురై ఉంటారని అనుమానాలు వ్యక్తం చేశారు.

అనుమతి లేకుండా విత్తన విక్రయాలు

- ఉమ్మడి జిల్లాలో ఏడు దుకాణాలపై అధికారుల దాడులు


దుకాణాల్లో సోదాలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎలాంటి అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం నాలుగు బృందాలుగా విడిపోయి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన దాడుల్లో పెద్ద మొత్తంలో విత్తనాలు సీజ్ చేశారు. అనంతపురంలోని శ్రీకంఠం సర్కిల్‌లో ఉన్న కోకిల సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, శ్రీలేఖ ఫర్టిలైజర్స్‌లో మొత్తం రూ.1,87,630 విలువ చేసే 40.15 కిలోల విత్తన నిల్వలను సీజ్ చేసి వ్యవసాయశాఖాధికారులకు అప్పగించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పరిగిలోని నందిని సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ ఏజెన్సీ, భూమిపుత్ర ఆగ్రో ఏజెన్సీలో తనిఖీలు చేపట్టి రూ.1 లక్ష విలువ చేసే 46 కిలోల విత్తనాలను సీజ్ చేశారు. అక్రమంగా విత్తనాలు అమ్మకాలు సాగిస్తున్న దుకాణాదారులపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ సీఐలు సాయిప్రసాద్, రామారావు, వెంకటరమణ, ఏఓ జె.వాసుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీకేఎస్ కేంద్రంగా రైతు భరోసా పంపిణీ

- హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లాధికారులు

శింగనమల/బుక్కరాయసముద్రం: ఈ ఏడాది వైఎస్సార్ రైతు భరోసా తొలి విడత పంపిణీ కార్యక్రమాన్ని బుక్కరాయసముద్రంలో చేపట్టనున్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతితో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్ గౌతమి, డీఏఓ చంద్రానాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. కాగా, శింగనమల నియోజకవర్గంలో 53,635 మంది రైతులకు రూ. 29,49,92,500 వైఎస్సార్ రైతు భరోసా లబ్ధి చేకూరనుంది. ఇందులో గార్లదిన్నె మండలంలో 9,164 మంది, శింగనమల మండలంలో 9,358 మంది, యల్లనూరు మండలంలో 8,493 మంది, పుట్లూరు మండలంలో 8,537 మంది, బుక్కరాయసముద్రం మండలంలో 8,710 మంది, నార్పల మండలంలో 9,373 మంది రైతులు ఉన్నారు.

ఏపీజీబీ ద్వారా విరివిగా రుణాలు

- డీబీఎస్ సేవలు ప్రారంభించిన చైర్మన్ రాకేష్‌కశ్యప్


మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

అనంతపురం అగ్రికల్చర్: అన్ని వర్గాల అభ్యున్నతికి, అన్ని రంగాల పురోగతికి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ద్వారా విరివిగా రుణాలు అందజేస్తున్నట్లు ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. ఆధునికీకరించిన అనంతపురంలోని ఆ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంతో పాటు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు (డీబీఎస్), కాల్‌సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జీఎం గిరి, ఆర్‌ఎం మోహన్‌రెడ్డితో కలసి మీడియాతో మాట్లాడారు. 10 జిల్లాల పరిధిలో విస్తరించిన ఏపీజీబీ సేవల ద్వారా 60 లక్షల మంది ఖాతాదారుల మన్ననలు పొందుతున్నామన్నారు. దీంతో బ్యాంకు వ్యాపార టర్నోవర్ రూ.41,600 కోట్లకు చేరుకుందన్నారు. డిపాజిట్లు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా మంచి లాభాలు ఆర్జించినట్లు పేర్కొన్నారు. బ్యాంక్ కార్యకలాపాల్లో అనంతపురం రీజియన్ అత్యంత కీలకమన్నారు. రూ.5,688 కోట్ల టర్నోవర్‌తో అన్ని రీజియన్ల కన్నా ముందంజలో ఉందన్నారు. ఇందులో రూ.2,722 కోట్ల డిపాజిట్లు, రూ.2,966 కోట్ల రుణాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూనే మహిళా సంఘాలు, విద్యా, వ్యాపార, హౌసింగ్, వాహన రుణాలు కూడా పెద్ద మొత్తంలో అది కూడా సరళీకృతమైన విధానంలో అందిస్తున్నట్లు తెలిపారు. తాజాగా డిజిటల్ సేవలు అందుబాటులోకి తేవడంతో రానున్న కాలంలో మరింత మెరుగ్గా ఖాతాదారుల మన్ననలు పొందుతామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

డీటీసీగా వీర్రాజు



అనంతపురం సెంట్రల్: జిల్లా రవాణాశాఖ ఉప రవాణా కమిషనర్‌గా వీర్రాజు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న శివరామప్రసాద్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అనకాపల్లి ఆర్టీఓగా పనిచేస్తున్న వీర్రాజు పదోన్నతిపై అనంతపురానికి రానున్నారు.

ఎంటీపీ చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

అనంతపురం క్రైం: మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టాన్ని అతిక్రమించి అబార్షన్లు చేస్తే సదరు ఆస్పత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎంటీపీ అనుమతులు తీసుకోని ప్రైవేట్ నర్సింగ్ హోంలు తక్షణమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఒంటరి మహిళలే టార్గెట్

- జ్యూస్‌లో నిద్రమాత్రలిచ్చి ఆభరణాల చోరీ
- అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్
- 124.8 గ్రాముల బంగారు, సెల్‌ఫోన్లు, నిద్రమాత్రలు స్వాధీనం


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బీవీ శివారెడ్డి

రాప్తాడు రూరల్: మాటలే ఆ దొంగకు పెట్టుబడి. ఒంటరి మహిళలే లక్ష్యంగా తన మాటలతో బుట్టలో వేసుకుంటాడు. వారే ఇళ్లకు పిలుచుకునేలా చేస్తాడు. ఎంచక్కా భోజనం చేస్తాడు. ఆ తర్వాత తాను తెచ్చుకున్న జ్యూస్‌లో నిద్రమాత్రలు కలిపి మహిళలకు ఇస్తాడు. తాగగానే స్పృహ కోల్పోయిన మహిళల ఒంటిపై బంగారు నగలు అపహరించుకెళుతాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 20కి పైగా కేసులు నమోదైన కేటుగాడి ఆటను ఎట్టకేలకు అనంతపురం రూరల్ పోలీసులు కట్టడి చేశారు. వివరాలను బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లా కోట మండలం శ్యామచంద్రాపురం గ్రామానికి చెందిన చేవూరి చంద్ర అలియాస్ చంద్రబాబు తన 16వ ఏట ఇల్లు వదిలి జులాయిగా మారాడు. తన వ్యసనాలకు అవసరమైన డబ్బును సులువుగా సంపాదించుకునేందుకు దొంగతనాలకు తెరలేపాడు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో తమ గమ్యస్థానానికి వెళ్లేందుకు వేచి ఉన్న ఒంటరి మహిళలతో మాట కలిపి, ఆకట్టుకుంటాడు. అనంతరం వారి ఫోన్ నంబర్లు, చిరునామా సేకరించుకుని, తరచూ ఫోన్లు చేస్తూ పలకరించి వారే ఇళ్లకు పిలిచేలా చేస్తాడు. ఈ క్రమంలో వారి ఆహ్వానం మేరకు ఇంటికి వెళ్లే సమయంలో ఓ జ్యూస్ బాటిల్ కొనుగోలు చేసి అందులో నిద్రమాత్రలు కలిపి, మాటలతో జ్యూస్‌ను మహిళల చేతే తాగించి వారు నిద్రలోకి జారుకోగానే విలువైన బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లేవాడు. ఈ క్రమంలో అనంతపురం నగర శివారు ప్రాంతానికి చెందిన ఓ మహిళను, తాడిపత్రిలో మరో మహిళను వంచించాడు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి నిందితుడి కోసం గాలిస్తున్నారు. గతంలో ఇతనిపై నంద్యాల, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు తదితర జిల్లాల్లో 20కు పైగా కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో జైలు నుంచి బయటకు రాగానే అనంతపురం, తాడిపత్రి, ముషీరాబాద్‌లో చోరీకి పాల్పడ్డాడు.

అరెస్ట్ ఇలా...

రూరల్ పీఎస్ సీఐ విజయభాస్కర్‌గౌడ్‌కు రాబడిన పక్కా సమాచారంతో ఎస్‌ఐ నబీరసూల్, కానిస్టేబుళ్లు శివన్న, జయరాం, పాండవ.. బృందంగా ఏర్పడి, ఆర్టీసీ బస్టాండు సమీపంలో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ. 6.40 లక్షల విలువ చేసే 124.8 గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్లు, నిద్రమాత్రలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

చేనేత రిజర్వేషన్ అమలు చేయాలి



జేవీవీ కార్యాలయంలో మాట్లాడుతున్న చేనేత కార్మికులు

అనంతపురం కల్చరల్: చేనేత కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేనేత రిజర్వేషన్లను అమలు చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'చేనేతకు రక్షణ, కర్ణాటక ఎన్నికల్లో అక్కడి పౌరసమాజం పాత్ర' అంశాలపై సమాలోచన కార్యక్రమం జరిగింది. ఆప్కో మాజీ ఎండీ రమణ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎం బాషా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రైతు సంఘం నాయకులు శివారెడ్డి, డాక్టర్ ప్రసూన, రెడ్స్ సంస్థ భానుజ, చేనేత కార్మికులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాగాయకుడు లక్ష్మీనారాయణ, బాబాఉద్దీన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనంతపురం సెంట్రల్: 18 ఏళ్లు నిండని బాలికలకు వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విష్ణువర్ధిని తెలిపారు. బుధవారం నగరంలో నెహ్రూపూర్‌మెన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు విద్య చాలా అవసరమని, తల్లిదండ్రులు బాలికలను చదివించాలని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరి, ఎంఎస్‌కే ప్రమీల, ఏఎన్ఎం సుభాషిణి, అంగన్‌వాడీ వర్కర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని శ్రీమత్కన్యకాపరమేశ్వరి ఆలయంలో స్వర్ణోత్సవం సందర్భంగా మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం సభ్యులు బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ 1న ఆర్యవైశ్య మహిళలతో కుంభాల ఊరేగింపు, గంగానయనం, గోపూజ, దేవానంది, పంచగవ్యం, రక్షాబంధనం, అఖండ దీపస్థాపన, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, దీక్షా హోమం నిర్వహించనున్నారు. 2న ప్రాతఃకాల పూజ, జపం, ఆవాహిత ప్రతిష్ఠ దేవతాహోమం, సుదర్శన హోమం, చండీ హోమం, ధ్యాన్యాధివాసం, రుద్రహోమం, నవగ్రహ హోమం మహా మంగళహారతి నిర్వహించనున్నారు. 3న తెల్లవారుజామున 4 గంటలకు పత్నీ సమేతంగా నగ్రహ దేవతల యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, బలిహరణ, మహా పూర్ణాహుతి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

శుభకార్యం

రాప్తాడు: పాలచెర్లకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఎర్రిస్వామి కుమార్తె కల్పన వివాహ వేడుకకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. బుధవారం పాలచెర్లలో వధువు ఇంటి వద్ద జరిగిన వివాహ వేడుకకు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి హాజరై వధూవరులు కల్పన, నాగేంద్రను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి ఎర్రిస్వామికి వివాహ ఖర్చులకు రూ.50 వేలు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ సర్పంచు బండి శ్రీనివాసులు, నాయకులు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



పనులు వేగవంతం చేయాలని ఏఈని ఆదేశిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. బుధవారం నగరంలోని నాడు–నేడు కింద పాఠశాలలో, వివిధ డివిజన్లలో జరిగే అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాతూరు, రాణినగర్‌లోని జాకీర్ హుస్సేన్, మరికొన్ని పాఠశాలల్లో పనుల పురోగతిపై ఇంజినీర్లతో కమిషనర్ మాట్లాడారు. కమిషనర్ వెంట ఏఈ బాబావలి, తదితరులున్నారు.

● హోయ్ హోయ్.. రయ్‌రయ్!

ఓ వైపు నగరం దినదినాభివృద్ధి చెందుతుంటే.. మరోవైపు అడుగడుగునా ట్రాఫిక్ చిక్కులుండేవి.. నగర రహదారులపైకి రావాలంటే వాహనదారులు పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లుండేది.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నగర సుందరీకరణకు పెద్దపీట వేశారు. ట్రాఫిక్ అవస్థలకు చెక్ పెడుతూ నగర నడిబొడ్డున టవర్‌క్లాక్ నుంచి బైపాస్ రహదారికి కలుపుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ - నాలుగు లేన్ల రహదారి) నిర్మాణం పూర్తి చేశారు.. దీంతో రాకపోకలు సునాయాసంగా సాగుతున్నాయి. 1,2,3,4,5,6 రోడ్లు, తపోవనం, బళ్లారి, కళ్యాణదుర్గం బైపాస్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వెళ్లే వాహనదారులతో బ్రిడ్జి సందడిగా మారింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



టవర్‌క్లాక్ వద్ద ఉన్న ఆర్‌ఓబీపై వాహన రాకపోకలు



కొత్త బ్రిడ్జి పక్కనే సుందరంగా కనిపిస్తున్న పీటీసీ మైదానం



ఆర్‌ఓబీపై వెళ్తున్న వాహనదారులు



నడిమివంక నుంచి టవర్‌క్లాక్‌పై వెళ్తున్న వాహనాలు

ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణకుమారి



నియామకపత్రం అందిస్తున్న వీసీ రామకృష్ణా రెడ్డి, రెక్టార్ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ కృష్ణకుమారి నియమితులయ్యారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు ఆర్ట్స్, సైన్స్ క్యాంపస్ కళాశాలలుగా వేర్వేరుగా ఉండేవి. ఒక్కో కళాశాలకు ఒక ప్రిన్సిపాల్‌ను నియమించారు. గతంలో ఒకే క్యాంపస్ కళాశాలగా ఉండేది. మాజీ వీసీ రాజగోపాల్ హయాంలో ఆర్ట్స్, సైన్స్ క్యాంపస్ కళాశాలలుగా మార్పు చేశారు. దీంతో పాలనాపరమైన సమస్యలు ఉండడంతో తిరిగి ఒకే కళాశాలగా మార్పు చేస్తూ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. ఇది వరకు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ కృష్ణకుమారిని క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. గతంలో కృష్ణకుమారి ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ప్రిన్సిపాల్‌గా నియామకం అయిన సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు. హాస్టళ్లకు చీఫ్ వార్డెన్‌గాను వ్యవహరించనున్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అనంతపురం కల్చరల్: పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ నడుం బిగించాలని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య అన్నారు. బుధవారం నెహ్రూ యువకేంద్రం, కేఎస్ఎన్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం జరిగింది. డాక్టర్ శంకరయ్య, విజన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బిసాటి జీవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ అన్నపూర్ణ, రేణుకాదేవి, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జయమారుతి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి నందిత తదితరులు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న స్త్రీ విముక్తి సంఘటన, పీడీఎస్ఓ నాయకులు

అనంతపురం అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని స్త్రీ విముక్తి సంఘటన, పీడీఎస్ఓ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయా సంఘాల నాయకులు నల్ల బాడ్జీలు ధరించి స్థానిక కృష్ణకళామందిర్ నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు మల్లేశ్వరి మాట్లాడుతూ న్యాయం చేయాలంటూ ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా చేస్తున్న మహిళా రెజ్లర్లపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్యన్నారు. బాధితులు జైలులో ఉంటే తప్పు చేసిన వాడు పార్లమెంట్‌లో ఉన్నాడని విమర్శించారు. దేశచరిత్రలో ఇదో మాయనిమచ్చగా నిలిచిపోతుందన్నారు. రెజ్లర్లపై పోలీసులు బనాయించిన అక్రమ కేసుల ఎత్తివేయాలని, బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాళ్లు శ్రీలక్ష్మి, సరిత, రాధ, ప్రమీల, వెంకటలక్ష్మి, వేణి, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం ఇంట్లో చోరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కోవూరు నగర్‌లోని నాగుల కట్ట వద్ద నివాసముంటున్న ఏఎన్ఎం అంజినమ్మ ఇంట్లో దొంగలు పడ్డారు. మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లిన సమయంలో దుండగులు తాళాన్ని బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలోని జత బంగారు కమ్మలతో పాటు రూ.80 వేలు అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి చేరిన అంజినమ్మ... చోరీ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యవసాయశాఖలో సీనియర్ అసిస్టెంట్ల బదిలీ

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖలో సీనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. కళ్యాణదుర్గంలో పనిచేస్తున్న కృష్ణయ్య జేడీఏ కార్యాలయానికి, జేడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న ఆదంఖాన్‌ను కళ్యాణదుర్గానికి, పెనుకొండలో పని చేస్తున్న నారాయణస్వామిని ఉరవకొండకు బదిలీ చేశారు.

నాటుసారా విక్రయదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి

గుత్తి రూరల్: గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు మానేసిన వారితో పాటుగా పాత నేరస్తులకు ప్రభుత్వం ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపుతామని జిల్లా అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు తెలిపారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం నాటుసారా కేసులో ఉన్న వారికి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహబూబ్ బాషా, సీఐ వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, సెబ్ సీఐ వరలక్ష్మి వీసీ ద్వారా బసినేపల్లి, బసినేపల్లి తండా, పట్టణానికి చెందిన నాటుసారా విక్రేతలకు అవగాహన కల్పించారు. నాటుసారా తయారీ, విక్రయమే వృత్తిగా చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ వృత్తులు, వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సహిస్తామన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పిస్తామన్నారు. వీఆర్‌ఓ రంగయ్య, వెలుగు సిబ్బంది, సివిల్, సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: ధూమపానానికి దూరంగా ఉండాలని వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాప్తాడులో వైద్య సిబ్బంది ధూమపానంతో వచ్చే రోగాలు, వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ఎప్పుడూ పొగాకు, పొగాకు ఉత్పత్తులు వినియోగించకూడదన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీ నరసమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పొగాకు, బీడీ, సిగరెట్ ప్రమాదకరమైనవని, ఆరోగ్యానికి హానికరమని వైద్యాధికారి దయాకర్ తెలిపారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సబిహా సుల్తానా, ఎంపీహెచ్ఓలు నాగేశ్వరయ్య, మునాఫ్, పీఎహెచ్ఎన్ తులసమ్మ, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌కు అదనపు బాధ్యతలు

అనంతపురం క్రైం: టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలికి నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న మురళీకి పదోన్నతి రావడంతో ఆయన ఈ నెల 14న రాత్రి రిలీవ్ అయ్యారు. దీంతో మురళీ పరిధిలోని వివిధ డివిజన్లను దుర్గాంజలి పరిశీలించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జేవీవీ వైజ్ఞానిక తరగతుల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

అనంతపురం కల్చరల్: ఈనెల 3,4 తేదీల్లో గుత్తి శ్రీసాయి డిగ్రీ కాలేజీలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వైజ్ఞానిక తరగతులు జరుగుతాయని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. బుధవారం స్థానిక జేవీవీ కార్యాలయంలో డార్విన్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం, విశ్వ ఆవిర్భావం, ప్రకృతి సూత్రాలు, పరిణామ వాదం సైన్సు చరిత్ర , జేవీవీ భవిష్యత్‌కార్యాచరణ పై తరగతులు ఉంటాయన్నారు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ రామ్మూర్తి, ఆదిశేషు, అమరనాథ రెడ్డి తదితరులు తరగతులు తీసుకుంటారన్నారు. వైజ్ఞానిక సదస్సును జయప్రదం చేయడానికి జేవీవీ కార్యకర్తలందరూ కృషి చేయాలని జేవీవీ నగర అధ్యక్షుడు ముత్యాలు, ప్రధాన కార్యదర్శి గాంగేనాయక్, కార్యదర్శి రామకృష్ణ, ప్రసాద్, నీలకంఠ కోరారు.

నడకకు బై బై.. సైకిల్‌పై రయ్ రయ్



క్యాంపస్‌లో సరదాగా సైకిల్ తొక్కుతున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వందల ఎకరాల్లో విస్తరించి ఉంది. క్యాంపస్‌లో తరగతి గదులు, కార్యాలయాలు, పాలనా భవనాలు కూడా దూరంగా ఉన్నాయి. విద్యార్థులు, సందర్శకుల సౌకర్యార్థం సైకిళ్లు అందుబాటులోకి తెచ్చారు. ఇక విద్యార్థులు, సందర్శకులు క్యాంపస్‌లో ఎక్కడికెళ్లాలన్నా సైకిల్‌పై వెళ్లొచ్చు. అందుకోసం స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఎస్కేయూ బ్రాంచ్ 30, కందుకూర్ రోడ్డు కెనరా బ్యాంక్ ఐదు సైకిళ్లను వర్సిటీకి అందజేశాయి. సైకిల్ స్టాండ్‌కోసం షెడ్డును వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, పీఆర్వో డాక్టర్ కే రాంగోపాల్, ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

గైనిక్ యూనిట్ పరిశీలన

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన గైనిక్ విభాగం అదనపు పడకల యూనిట్‌ను డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి బుధవారం పరిశీలించారు. ప్రస్తుతానికి 40 పడకలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు పడకుండా ఫ్యాన్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు, తదితరులు పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం టవర్‌క్లాక్: పదో తరగతి ఫలితాల్లో (550 మార్కులు) ప్రతిభ చాటిన బలిజ విద్యార్థి, విద్యార్థినులకు రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందించనున్నారు. ఈమేరకు బుధవారం సంఘం జిల్లా అధ్యక్షుడు పాములాయి వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు బలిజ సంఘం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 9000022777, 9989375456, 9247792567,9490180177, 9440440969 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆలయ అభివృద్ధికి మరింత కృషి



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

రాప్తాడు: లక్ష్మీ పండమేటి వెంకటరమణ స్వామి (పండమేటి రాయుడు) ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరుడు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో లక్ష్మీ పండమేటి వెంకటరమణ స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి బుధవారం తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. దేవదాయ, టీటీడీ నుంచి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేశారన్నారు. త్వరలోనే ఆలయ పునర్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఆలయ చైర్మన్ గంజి రాముడు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు సాకే వెంకటరాముడు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకత వెలికితీయాలి

● అదనపు ఎస్పీ ఆర్. విజయభాస్కర్‌రెడ్డి



వేసవి శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీయొచ్చని జిల్లా అదనపు ఎస్పీ ఆర్. విజయభాస్కరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు క్వార్టర్స్ ఆవరణలోని డీటీసీలో నెల రోజులుగా నిర్వహించిన 'అనంత పోలీస్ పిల్లల ఉచిత వేసవి శిక్షణ శిబిరం' ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అదనపు ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, ఎ.హనుమంతు (ఏఆర్)లు హాజరై ప్రసంగించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఎస్పీ కె. శ్రీనివాసరావు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. నెల రోజుల పాటు జరిగిన ఈ శిబిరంలో క్రీడలు, యోగా, డ్రాయింగ్, చేతిరాత, విలువలు, చెస్ ఆటలపై అథ్లెటిక్, యోగా కోచ్‌లతో తర్ఫీదు ఇప్పించినట్లు తెలిపారు. జిల్లాలోని హోంగార్డుల నుంచి పోలీసు అధికారుల వరకు వారి పిల్లలను శిక్షణ శిబిరంలో చేర్పించి, పిల్లల్లో శారీరక, మానసిక దృఢత్వానికి తల్లిదండ్రులు తోడ్పాటుగా నిలవడం హర్షణీయమన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న పిల్లలకు, ఫ్యాకల్టీ, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, వెల్ఫేర్ ఆర్ఎస్ఐలు రాజశేఖర్ రెడ్డి, డీటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



ఆస్పత్రి ఎదుట అన్నదానం చేస్తున్న మాజీ మేయర్ రాగే పరుశురాం

అనంతపురం క్రైం: సూపర్ స్టార్ కృష్ణ జయంతిని కృష్ణ సేన నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద కేక్ కట్ చేసి, పంచారు. అనంతరం రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మేయర్ రాగే పరుశురాం మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ మంచి మనసున్న వ్యక్తి అని కొనియాడారు. ఏటా ఆయన జయంతిని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణ సేన నాయకులు కేఆర్ కుళ్లాయప్ప తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీఎస్ శ్రీరాములు, కృష్ణ సేన నాయకులు రవిరాజ్, విజయకృష్ణ, వెంకటేష్, శేఖర్, ఈశ్వర్, రఫీ, రఘు తదితరులు పాల్గొన్నారు.

మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ప్రజలకు తెలియజేస్తాం

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాసులు

అనంతపురం టవర్‌క్లాక్: బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉందని, ఆయన పాలనపై ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,ఎస్సీ మోర్చ రాష్ట్ర ఇన్‌చార్జ్ సామంచి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ 9 ఏళ్ల పాలనలో దేశంలో ఎన్నో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయన పాలనపై బహిరంగ సభలు నిర్వహించి, ప్రజలకు తెలియజేస్తామన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను కాపీ కొట్టి చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోను ప్రవేశపెట్టారన్నారు. 18 ఏళ్ల యువతులకు కూడా రూ.1,500 ఇస్తామని ప్రకటించారన్నారు. రాష్ట్రంలో యువతులు, మహిళల జనాభా కూడా అధికంగా ఉందని, ఇలాంటి పథకాలు అమలు చేస్తే బడ్జెట్ సరిపోదన్నారు. అపద్ధాలు చెప్పి అధికారంలోకి రావాలని చంద్రబాబు చూస్తున్నారని, ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు లలిత్‌కుమార్, రామచంద్రయ్య, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నాచింగ్‌లకు చెక్

● నగరంలోని నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక నిఘా

● గట్టి భద్రతను ఏర్పాటు చేసిన ఎస్పీ శ్రీనివాసరావు



మంగళవారం రాత్రి స్నాచింగ్ చేసిన దొంగ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్‌లు జోరుగా జరుగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో స్నాచర్లు చెలరేగిపోతున్నారు. మహిళల మెడలో ఉన్న బంగారు గొలుసులను దుండగులు లాక్కెళ్తున్నారు. వరుసగా చైన్ స్నాచర్లు హల్‌చల్ చేస్తుండటాన్ని ఎస్పీ శ్రీనివాసరావు సీరియస్‌గా పరిగణించారు. చైన్‌స్నాచింగ్‌లకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకున్నారు. నగరంలోని నాలుగు స్టేషన్ల పరిధిలో స్నాచింగ్ జరుగుతున్న స్పాట్‌లను గుర్తించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసు అధికారులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు.

చైన్‌స్నాచింగ్‌లపై ఎస్పీ ఆరా...

మూడు నెలల క్రితం ఇదే బళ్లారి బైపాస్‌లో కిరాణా స్టోర్‌కు చెందిన ఓ మహిళపై కత్తితో దాడి చేసి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని వెళ్లిన సంఘటనలను ఆరా తీశారు. తిరిగి ఆ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లు జరగకుండా గస్తీలు, నిఘా పెంచాలని ఎస్పీ సూచించారు. సుమారు ఒక్కో స్టేషన్‌పరిధిలో ఐదారు కాలనీలు స్నాచింగ్‌లకు అనువుగా ఉన్నట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు, స్థానికుల సహకారంతో స్నాచర్ల ఆగడాలకు కళ్లెం వేయాలని సూచించారు. సీసీఎస్ సిబ్బందితో పాటు ప్రతి స్టేషన్‌లోని క్రైంపార్టీలను అప్రమత్తం చేశారు. బళ్లారి బైపాస్ ప్రాంతంలో నాలుగురోజుల క్రితం మహిళ మెడలో ఉన్న గొలుసును దుండగుడు లాక్కెళ్లాడు. అది నకిలీ గొలుసు కావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. బళ్లారి బైపాసులోని తిరుమల స్టోర్‌కు చెందిన మహిళ జ్యోతి మెడలో ఐదు తులాల బంగారు గొలుసును మంగళవారం రాత్రి స్నాచర్లు లాక్కెల్లారు.

శివారు ప్రాంతాలను అప్రమత్తం చేయండి:

ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల్లోని మహిళలు, వృద్ధులను అప్రమత్తం చేయాలని ఎస్పీ ఆదేశించారు. అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉంటూ విలువైన వస్తువులను జాగ్రత్త పరుచుకునేలా జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. రాత్రి వేళ అర్ధరాత్రి దాకా దుకాణాలు తెరిచి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానితులపై నిఘా ఉంచి ఉచిత 100 డయల్‌గాని, సంబంధిత స్టేషన్ల పోలీసులకు గాని సమాచారం ఇచ్చేలా కాలనీల్లోని ప్రజలతో మమేకం కావాలన్నారు. ఊరెళ్లాల్సి వస్తే ఇళ్లలో విలువైన వస్తువులు, నగదు ఉంచి వెళ్లడం సరికాదన్నారు.